తేదీ 19.08.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు

# మంత్రములే మన దేశానికి రక్ష

ప్రేమస్వరూపులారా! వెతుకుచున్నాను నేను; వెతుకుచునే ఉన్నాను. వెతుకుచుంటి నాడు, నేడు నిజమానవ ధర్మపరుని.

**అంధకారం బెల్ల హతమారునే చూడ**
**వసుధలో దీపంపు వార్త వలన**
**ఆకొన్నవారికి ఆకలి తీరునే**
**పంచ భక్ష్యంబుల పాకము విన్న**
**నిరుపేదవాని పేదరికము పోవునా**
**విత్త ప్రభావంబు విన్నయంత**
**రోగ పీడితుని బల్ రోగాలు పోవునా**
**ఔషధ మహిమంబు నంత విన్న**
**శాస్త్ర జాలంబు నంతయు చదివినంత**
**దట్టమైనట్టి యజ్ఞాన తమము తెగున**
**ఆచరణ లేని విద్యలు అవనియందు**
**నిండ నేర్చిన ఫలమేమొ గుండు సున్న**

ప్రేమస్వరూపులారా! ప్రతి ఒక్కటికూడను మనం ఇతరులకు బోధించే ముందు స్వయంగా ఆచరణలో పెట్టి అనుభవించాలి. అనుభవించి, ఆనందించి అందించడం అత్యవసరం. ఋత్విక్కులందరుకూడను చాలా మంచివారు. నాకు నచ్చినటువంటి ఋత్విక్కులు చిక్కారు. మీరు ఈ పది దినములు చేసినటువంటి సాధన, యజ్ఞము చాలా సంతృప్తికరంగా ఉన్నవి. ఆశించినదానికంటే అధికంగానే చేస్తూ వచ్చారు. ఇలాంటి ఋత్విక్కులు చిక్కటం చాలా అదృష్టం. రేపటి దినము ఈ మహాయజ్ఞము

sri sathyasai vachanamrutam

పరిసమాప్తమవుతున్నది. యజ్ఞము సమాప్తం అవుతుందిగాని, మంత్రములు సమాప్తం కావు. మంత్రము శాశ్వతంగానే ఉంటుంది. అది గుణములతో కూడినటువంటిది కాదు. ఇట్టి మంత్రములు నిరంతరముకూడను మన చెవులలో వినిపిస్తూనే ఉంటాయి. మంత్రముతో కూడినటువంటి వాడే ఋత్విక్కు. ఋత్విక్కు వేరు, మంత్రము వేరు కాదు. మంత్రమే లేకపోతే తాను ఋత్విక్కే కాదు. ఈ మంత్రములు చాలా అదృష్టవంతులకు మాత్రమే ప్రాప్తిస్తాయి. ఈ లోకములో ఎంతమంది లేరు! అంతమందిలో 132మంది మాత్రమే ఈ యజ్ఞములో ఋత్విక్కులుగా పాల్గొనగలిగారు. మీరెంత అదృష్టవంతులు! “శాస్త్రంబు నెప్పుడు సత్యంబుగా నెంచు వేదసమ్మతులైన విప్రులారా!” విప్రులు శాస్త్రాలను నమ్మినటువంటివారు. ఇటువంటి ఋత్విక్కులు మరెక్కడైనా చిక్కుతారా? చిక్కుతారు. కాని, అందరిలో అంతో ఇంతో భేదముంటుంటాది. ప్రమాణ పూర్వకంగా చెప్పాలంటే, మీరు చెప్పేటటువంటి ప్రతి మంత్రముకూడా సుస్పష్టంగా ఉంటున్నది. ఈరీతిగా మంత్రములు చెప్పే ఋత్విక్కులు చిక్కటం చాలా అదృష్టం. ఇటువంటి ఋత్విక్కులు ఇక్కడ యజ్ఞములో పాల్గొన్నందుకు అందరూ చాలా ఆనందిస్తున్నారు. ఇదేవిధముగనే దసరా సందర్భంలో పుట్టపర్తిలో మరొక యజ్ఞము జరుగనున్నది. అది ప్రతి దసరాకు చేసే జ్ఞానయజ్ఞము. జ్ఞానయజ్ఞము మానసిక తత్త్వానికి సంబంధించినది.

**పది రోజులు పది నిమిషాలుగా గడచిపోయినవి**

ఋత్విక్కులారా! ఈ పది దినములు మీరు శ్రమ పడినందుకు మీకెంతో ఫలితమున్నది. ఈ ఫలితము మీకిప్పుడు తెలియదు. మీరు మీమీ స్వస్థానములకు వెళ్లిన తరువాత విచారించండి, తప్పక ఆ ఆనందము మీకు అనుభవంలోకి వస్తుంది. మన ఋత్విక్కులలో చాలామంది ‘యూత్’ (యువకులు) ఉన్నారు. ‘యూత్’ అంతా చేరి ఈవిధమైన పవిత్ర కార్యంలో పాల్గొనటం చాలా అదృష్టం. ‘ఇలాంటి ఋత్విక్కులు చిక్కటం చాలా అదృష్టమయ్యా’, అని నేను వినయ్‌కి చెప్పాను. మీకిక్కడ అనుకూలంగా జరిగిందో లేదో! భోజన, వసతి సదుపాయములు మీకు తగినరీతిగా ఉన్నవో లేవో! మీకు వినయ్ సరియైన అనుకూలములు చేస్తున్నాడో లేదో ... నేను ప్రొద్దున్ననుండి సాయంకాలము వరకు ఇదే యోచిస్తుంటాను. మీరు సంతోషంగా ఉంటే, నాకు అదే సంతోషము. ఈ పది

దినములుకూడను పది నిమిషములుగా గడచిపోయినవి. ఈ పది దినములుకూడను మీరెంతో ఆనందించారు, నేనూ ఎంతో ఆనందించాను. మీరెక్కడికి వెళ్లినప్పటికీ ఈ దృశ్యాన్ని మీరు మనస్సులో తల్చుకుంటూ ఉండాలి. ఈ పవిత్రమైన అనుభవాన్ని ఎన్నడూ మరువకూడదు. త్వరలోనే మీరు మళ్ళీ పుట్టపర్తికి వచ్చి చేరతారు. ఇంతియేకాక, అతిత్వరలోనే మద్రాసులో ఈ యజ్ఞము జరపాలని సంకల్పించుకున్నాను. మీరందరూ రావాలని నేను ఆశిస్తున్నాను. ముఖ్యంగా యజ్ఞముయొక్క విశిష్టతను మీరు గుర్తించాలి. యజ్ఞమనగా భౌతికమైనదా? లేక ఆధ్యాత్మికమైనదా? ఇది ఆధ్యాత్మికమైన యజ్ఞమేగాని, భౌతికమైన, లౌకికమైనటువంటి యజ్ఞము కాదు. మానసికంగా, శారీరకంగా, హృదయపూర్వకంగా ఆచరించి అనుభవించినటువంటిది ఈ యజ్ఞము.

**నేనెప్పుడూ మీ ఇంటనే, వెంటనే, జంటనే ఉన్నాను**

మీరు ఎలాంటి పంచెలు ధరించాలి అనే విషయం దగ్గరినుంచి ప్రతి ఒక్కటీ నేను స్వయంగా విచారిస్తూ, పనిచేస్తూ వచ్చాను. ఇంట్లో పిల్లల బాగోగులను తండ్రి ఏవిధంగా చూసుకుంటాడో ఆవిధంగా మీకు కావలసినవన్నీ నేను సమకూర్చుతూ వచ్చాను. రేపటి కార్యక్రమం తరువాత మిమ్మల్ని ఇక్కడినుండి పంపాలంటే నాకు చాలా కష్టంగా ఉంటున్నది. మీకూ ఇక్కడినుండి పోవడం చాలా కష్టంగా ఉంటున్నది. ఈవిధమైన సన్నిహిత సంబంధ బాంధవ్యమే నిజమైన భక్తి. నన్ను విడిచివెళ్లడం మీకు కష్టం. మిమ్మల్ని విడిచిపెట్టడం నాకు కష్టం. నేనెప్పుడూ మీ ఇంటనే, వెంటనే, జంటనే, కంటనే ఉన్నాను. కనుక, 'స్వామి ఎక్కడో పుట్టపర్తిలోనో, బెంగళూరులోనో ఉన్నాడు. మేము స్వామికి దూరంగా ఉన్నాము', అని మీరు ఏమాత్రము భావించకండి. నేను మీవెంటనే ఉన్నాను. మన ప్రధాన అర్చకుడు కూడను చాలా భక్తిగా, శ్రద్ధగా యజ్ఞాన్ని జరిపించాడు; తన స్వంతపనిగా భావించి చేశాడు. ఆవిధంగా భావించి చేసేవారు లోకంలో చాలా అరుదు.

**ఈ యజ్ఞము ఆత్మతత్త్వమును అర్థం చేసుకునేందుకే!**

ముఖ్యంగా మీరు అందరికీ త్యాగాన్ని బోధించాలి. ప్రతి మానవునికి ఎన్నియో ఆశలుంటుంటాయి. ఈ ఆశలన్నింటినికూడను దైవప్రీత్యర్థం అర్పితం గావించాలి. కేవలం

sri sathyasaivachanamrutam

'సెల్ఫ్' (స్వార్థం) మాత్రమే చూసుకోకండి. 'సెల్ఫ్' కంటే 'హెల్ప్' (పరోపకారం) చాలా మంచిది. ఏది చేసినా 'మా హృదయతృప్తికై మేం చేస్తున్నాము, మా ఆత్మకోసం మేము ఆచరిస్తున్నాము' అని మీరు భావించాలి. ఈ యజ్ఞము ఆత్మతత్త్వమును అర్థం చేసుకునే నిమిత్తమై చేసినటువంటి యజ్ఞమే గాని, ఏదో ప్రాపంచికంగా, లౌకికంగా, భౌతికంగా ఆచరించినటువంటి యజ్ఞము కాదు. మీ క్షేమం కోసం, మీ మంచికోసం, లోకకల్యాణంకొరకు మీరీ యజ్ఞంలో పాల్గొన్నారు. ఇది మీకు మాత్రమే కాదు, యావత్ప్రపంచమునకు సంబంధించి నటువంటిది. మీరు చెప్పిన మంత్రములన్నీ గాలిలో చేరి సర్వత్రా వ్యాపించి పోయినవి. ఈ పవిత్రమైన శబ్దములు మన హృదయాలలో చేరి పవిత్రతను చేకూర్చుతున్నాయి. కనుక, మీరు చెప్పినటువంటి మంత్రములు ఏదో ఇక్కడికి మాత్రమే పరిమితమైనాయనుకోవద్దు. అవి ప్రపంచమంతటా వ్యాపించి పోయాయి. ఈ యజ్ఞము మన ఇండియాకు మాత్రమే కాదు, అన్ని దేశములకు కూడను సంబంధించినటువంటిది. దేశ భాషల్లో వ్యత్యాసములు ఉండవచ్చును. కాని, భావములో ఎట్టి వ్యత్యాసమూ ఉండదు. అమెరికన్స్, రష్యన్స్, ఆఫ్రికన్స్ మొదలైనవారందరూ ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వాళ్లుకూడను ఇప్పుడు వేదమంత్రాలను నేర్చుకుంటున్నారు. పోయిన నెల 26వ తేదీన 80మంది జర్మన్లు స్పెషల్ ప్లేనులో పుట్టపర్తికి వచ్చారు. వారందరుకూడను వేదమంత్రాలను పఠించారు. "ఈ మంత్రములే మా దేశాన్ని రక్షిస్తున్నాయి. కనుకనే, తెల్లవారి లేచినది మొదలు రాత్రి పరుండునంతవరకు ఈ మంత్రములను చెబుతుంటాము", అన్నారు వాళ్లు.

**వేదమంత్రాలను ప్రపంచానికంతటికీ పంచాలి**

ఈ మంత్రోచ్చారణలో స్వార్థమనేది ఎక్కడా లేదు. ఇది అందరికీ సంబంధించినదిగా ఉంటున్నది. ప్రతి మానవునికి ఈ మంత్రములు చాలా అవసరము. ఇవి కేవలం వ్యష్టికి కాదు, సమష్టి స్వరూపానికి సంబంధించినవి; సమాజమునకు, దేశమునకు అందరికీ సంబంధించినవి. ఈనాడు పాశ్చాత్యులు కూడా ఈ మంత్రములను ప్రింటు చేసుకుంటున్నారు. వీటిని మనం ప్రపంచానికంతటికీ పంచాలి. విదేశీయులకు ఈ మంత్రములను ఉచ్చరించడం కష్టమే. ఎందుకంటే, వారి నాలుకలు తిరగడం చాలా కష్టం.



srisathyasaivachanamrutam

కాని, వాళ్ళు ఎట్లయినా సరే, పట్టు పట్టి నేర్చుకుంటున్నారు. మానవుడు పట్టుపడితే ఏదైనా సాధించగలడు.

**పట్టినదేదియో పట్టనే పట్టితివి**
**పట్టునెగ్గెడు దాక అట్టెయుండు**
**కోరినదేదియో కోరనే కోరితివి**
**కోర్కె చెల్లెడుదాక కొలిచియుండు**
**అడిగినదేదియో అడుగనే అడిగితివి**
**అడిగినదిడుదాక విడువకుండు**
**తలచినదేదియో తలచనే తలచితివి**
**తలపు తీరెడుదాక తరలకుండు**
**పోరుపడలేక తానైన ప్రోవవలయు**
**ఒడలు తెలియక నీవైన అడుగవలయు**
**అంతియేకాని మధ్యలో ఆపివేసి**
**తిరిగిపోవుట భక్తుని దీక్ష కాదు**

కనుక, మనము పట్టినదానిని సాధిస్తూ రావాలి. ఈ అతిరుద్ర మహాయజ్ఞమనేది మున్ముందు చాలా జరపాలి. ఇది ఒక కులానికో, ఒక మతానికో, ఒక దేశానికో సంబంధించినటువంటిది కాదు. ఇది ప్రపంచమంతటికీ సంబంధించినది. ఈ యజ్ఞమును మీరు చేస్తూ చేస్తూ ఉంటే ప్రపంచమంతా అతి త్వరలోనే అందరూ ఏకమైపోతారు. పాకిస్థాన్, అఫ్ఘనిస్థాన్, జపాన్, అమెరికా, జర్మనీ అన్నీ ఏకమైపోతాయి. ఇప్పుడు అమెరికాలో చాలా గొప్ప భక్తులున్నారు. అక్కడ చాలామంది ఋత్విక్కులుకూడా ఉన్నారు. మహమ్మదీయులు కూడా ఉన్నారు. ఒకామె స్వామినిగురించి ఒక పుస్తకం వ్రాసింది. ఆ పుస్తకాన్ని తీసుకువెళ్ళి అమెరికాలో ఉన్న తన గురువుకు ఇచ్చింది. అతను దానిని చూసి కంటిధారలు కార్చాడు. 'ఇంత అదృష్టము నాకుకూడా కలగాలి', అని ప్రార్థించాడు. ఇప్పుడా పుస్తకాన్ని ప్రింటు చేసి అక్కడ అందరికీ అందిస్తున్నారు.

మనము దేశాన్నంతటినీ ఏకం చేయాలి. భిన్నత్వంలో ఏకత్వాన్ని దర్శించాలి. చూడండి.

srisathyasaivacharamrutam

మన భారతదేశంలోనే ఇప్పుడు ఎన్ని విధములైన భేదాలు కలుగుతున్నాయి! దేశాన్ని ముక్కలు ముక్కలు చేయడం గొప్పతనం కాదు. ఒక్కటిగా చేర్చడం చాలా గొప్పతనం. 'యూనిటీ' ఎక్కడ ఉండునో అక్కడే 'ప్యూరిటీ' ఉంటుంది. 'ప్యూరిటీ' ఎక్కడో ఉండునో అక్కడే 'డివినిటీ' ఉంటుంది. కనుక, మనం 'యూనిటీ'కి తగిన ప్రయత్నం చేయాలి. నిన్న వేదం పఠించిన పిల్లల్లో రష్యన్ ఉన్నాడు, అమెరికన్స్ ఉన్నారు, ఇరాన్ పిల్లవాడుకూడా ఉన్నాడు. ఈవిధమైన ఏకత్వాన్ని మీరు గుర్తించి దీనిని అభివృద్ధిపరచాలి. మీ అందరియందుకూడను అంతో ఇంతో భేదబుద్ధి ఉంటే దానిని తక్షణమే తీసి పారవేయండి. ఏకంగా ఉండండి. అందరూ 'బ్రదర్స్ అండ్ సిస్టర్స్'గా కలసి మెలసి మెలగాలి. అప్పుడే మీకు తగినటువంటి విలువ ఏర్పడుతుంది.

**(తేదీ 19.08.2006, అతిరుద్ర మహాయజ్ఞం, సాయికుల్వంత్ హాలు)**

sri sathyasai vachanamrutam